నమస్తే తెలంగాణ
# రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, బుధవారం 22 మే 2024 | RAJANNA SIRCILLA

## పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

ఎస్పీ అఖిల్ మహాజన్


చెక్కు అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, మే 21: పోలీస్ కుటుంబాలకు జిల్లా పోలీస్‌శాఖ అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ అంజయ్య కుటుంబానికి తోటి సిబ్బంది అండగా నిలిచారు. అందరూ కలిసి పోగు చేసిన మొత్తాన్ని మంగళవారం ఎస్పీ మహాజన్ బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. తోటి సిబ్బంది చనిపోతే అందరూ కలిసి కుటుంబానికి బాసటగా నిలిచి స్వచ్ఛందంగా ఆర్థిక సాయం చేయడం హర్షణీయమన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధి త్వరగా ఇప్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ యాదగిరి, మల్లేశం, ప్రభాకర్, బాలు, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

## రైతు సమస్యలు గాలికొదిలి
# విదేశాలకు టూర్లా..?

- మంత్రి అమెరికా, ఎమ్మెల్యే దుబాయ్ ఎందుకు పోయినట్టు
- అన్నదాతలు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోరా
- వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ధ్వజం

వేములవాడ, మే 21: రైతులు తాము పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమయంలో ఆదుకునేవారు కరువయ్యారని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆవేదన చెందారు. రైతుల సమస్యలు గాలికి వదిలేసి మంత్రి పొన్నం ప్రభాకర్ అమెరికా, ఆది శ్రీనివాస్ దుబాయ్ టూర్లలో బిజీగా ఉన్నారని ధ్వజమెత్తారు. వడ్ల కొనుగోళ్లలో జాప్యంతో రైతులు నిద్రాహారాలు మాని సెంటర్లలో పడిగాపులు గాస్తుంటే.. వారేమో విదేశాల్లో షికార్లు చేయడం విడ్డూరమన్నారు. వేములవాడ సహకార సంఘం పరిధిలోనే 60 వేల క్వింటాళ్ల వడ్ల నిల్వలు, 10 వేల తూకం వేసిన బస్తాలు ఉన్నాయని చెప్పారు. మళ్లీ అకాల వర్షాలు వస్తే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వేములవాడలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ ప్రాంతంలో ఏర్పడిన కరువుతో ఒక్క రుద్రంగి నుంచే 2వేల మంది గల్ఫ్ దేశాలకు వెళ్లారని గుర్తు చేశారు. కానీ, స్వరాష్ట్రంలో పుష్కలంగా సాగునీరందించడంతో గల్ఫ్ నుంచి వాపస్ వచ్చి వ్యవసాయం చేసుకున్నారని తెలిపారు. కానీ, రేవంత్ ప్రభుత్వం నిర్వాకంతో మళ్లీ ఈ ప్రాంతం కరువుకోరల్లో చిక్కుకొనే ముప్పు ఉందని, ఈ ప్రాంత యువత మళ్లీ గల్ఫ్ బాట పట్టే విధంగా చేస్తున్నట్టు కనిపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. ప్రజలు కష్టాల్లో ఉన్న సమయంలో మంత్రి పొన్నం అమెరికాకు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దుబాయ్‌కి ఎందుకు వెళ్లారో చెప్పాలని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి కుమార్, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, జోగని శంకర్, సిరిగిరి రామచందర్, నరాల శేఖర్, గోలి మహేశ్, నాయకులు కమలాకర్ రెడ్డి, వెంగళ శ్రీకాంత్, ఈర్లపల్లి రాజు, సందీప్, మైలారపు రాము ఉన్నారు.

**ముంపు గ్రామాలకు పరిహారం ఎప్పుడిస్తరు?**

ఎన్నికల సమయంలో ముంపు గ్రామాలకు ₹5.4 లక్షలు ఇస్తామని ఆది శ్రీనివాస్ నమ్మించిండు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మరిచిపోయిండు. చిత్తశుద్ధి ఉంటే ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డితో ప్రకటన చేయించాలి. పరిహారం కోసం అక్కడి ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నరు.


– చల్మెడ లక్ష్మీనరసింహారావు





సిరిసిల్ల అర్బన్ మండలం సర్దాపూర్‌లోని మార్కెట్ యార్డు వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు, రైతులు

# దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాల్సిందే


మానకొండూర్: సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


ధర్మారం:ధర్మారంలో అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


కొడిమ్యాల: కొనుగోలు కేంద్రంలో నినదిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**తేల్చి చెప్పిన బీఆర్ఎస్ దళం**

- మరోసారి సన్నవడ్లకే బోనస్ అనడంపై ఆగ్రహం
- అన్నదాతకు అండగా కాంగ్రెస్‌పై యుద్ధభేరి
- ఉమ్మడి జిల్లాలో ధర్నాలు, రాస్తారోకోలు
- రేవంత్ దిష్టిబొమ్మల దహనాలు
- తడిసిన ధాన్యాన్నీ కొనాలని డిమాండ్

రాజన్న సిరిసిల్ల, మే 21(నమస్తే తెలంగాణ) :అన్నదాత కోసం బీఆర్ఎస్ మరోసారి పోరు బాట పట్టింది. రైతన్నను వంచించిన కాంగ్రెస్‌పై మరోసారి యుద్ధభేరి మోగించింది. ఎన్నికల ముందు వరకు అన్నిరకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని నమ్మించి, ఇప్పుడు సన్న రకం వడ్లకు మాత్రమే ఇస్తామని ఇటీవల రేవంత్ రెడ్డి, తాజాగా మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలపై భగ్గుమన్నది. పార్టీ పిలుపు మేరకు మంగళవారం ఉమ్మడి జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో రైతులతో కలిసి ఆందోళనకు దిగింది. రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు చేసింది. పలుచోట్ల సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేసి నిరసన తెలిపింది. నిన్నటి దాకా సాగునీరివ్వక సావగొట్టిందని, కరెంటు కోతలతో పంటలను ఎండగొట్టి, కష్టించి పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనక అకాల వర్షాల పాలు చేసిందంటూ మండిపడింది. ఇది ప్రజా ప్రభుత్వం కాదని, ప్రజావ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తింది. సన్నవడ్లకే కాదు, అన్ని రకాల వడ్లకు ₹500 బోనస్ ఇవ్వాలని, తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేసింది. లేదంటే ఊరుకునేది లేదని, పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరికలు జారీ చేసింది.

## జూలై 3 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- అభ్యర్థులు దరఖాస్తు చేసుకోండి
- కరీంనగర్ జిల్లా ఉపాధి అధికారి

కొత్తపల్లి, మే 21 : జూలై 3 నుంచి 12 వరకు కర్ణాటకలో నిర్వహించే ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు (సంగీతకారుడు) రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కరీంనగర్ జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకొనే వారు అవివాహితులై ఉండాలని, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల, బోర్డు నుంచి కనీస పాస్ మార్కులతో, 10వ తరగతి ఉత్తీర్ణత లేదా సమాన విద్య కలిగిన అభ్యర్థులు టెంపో, పిచ్, ఒక పూర్తి పాట పాడడంలో కచ్చితత్వంతో సంగీతంలో ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు https:// agnipathvayu.cdac.in ను సందర్శించాలని సూచించారు.


సిరిసిల్ల ఏరియా దవాఖానలో మహిళా కూలీని పరామర్శిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

# మట్టిపెల్లల కింద చితికి..


మారుపాక రాజవ్వ (ఫైల్)

**వెంకట్రావుపేటలో ఈజీఎస్ మహిళా కూలీ మృతి**

- ఉపాధి పని చేసే చోటే ప్రమాదం
- మరో ఆరుగురికి తీవ్ర గాయాలు
- క్షతగ్రాతులను పరామర్శించిన చల్మెడ, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట, మే 21: పొద్దుపొద్దునే తట్టపార పట్టుకుని వారంతా ఉపాధి హామీ పనికి వెళ్లారు. పని మొదలైన కొద్దిసేపటికే మట్టిపెల్లలు పడి ఒకరు మృతి చెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన కూలీలంతా మంగళవారం ఉదయాన్నే కేశవరావు చెరువులోకి ఉపాధిహామీ పనికి వెళ్లారు. కర్నాల శ్యామల, కర్నాల లహరి, ఏడ్ల రామవ్వ, పల్లం దేవయ్య, వడ్నాల అమృతవ్వ, సందు చంద్రయ్య, మారుపాక రాజవ్వ ఒకే గ్రూప్‌లో పని చేస్తున్నారు. చెరువు కట్ట కిందిభాగాన మట్టిని సొరంగంలా తీసి ఒక ట్రిప్పు ట్రాక్టర్‌లో పోశారు. సదరు ట్రాక్టర్ తిరిగివచ్చే వరకు విశాంత్రి తీసుకుందామని వారంతా కలిసి ఒకచోట కూర్చున్నారు. కొద్దిసేపటికే క్షణాల్లోనే మట్టిపెల్లలు కుప్పకూలడంతో కూలీలందరు గాయపడ్డారు. తోటి కూలీలు వెంటనే క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మారుపాక రాజవ్వ (50) చికిత్స పొందుతూ మృతి చెందింది. అలాగే కర్నాల లహరి, పల్లం దేవయ్య కాలు విరుగగా, వీరంతా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. రాజవ్వ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రాజవ్వ భర్త రాములు 20 ఏళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కొడుకులు బాలకిషన్, సాయికృష్ణ, కూతురు సరిత ఉన్నారు. రాజవ్వ కూతురు సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. సిరిసిల్ల ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న కూలీలను వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ వేర్వేరుగా పరామర్శించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు రాజవ్వ కుటుంబానికి తక్షణసాయం కింద తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు ₹50వేలు అందించగా, అలాగే చల్మెడ ₹10వేలు సొంతంగా అందించారు. అలాగే దుబాయ్‌లో ఉన్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బాధితులను ఫోన్‌లో పరామర్శించారు. ఘటన జరిగిన తీరును సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

# వానకాలం దగ్గరలో సిల్ట్ తొలగింపా..?

- ఏటా ఎండకాలం ప్రారంభంలోనే పనులు
- ఈ సారి మాత్రం వేసవి ముగిసే సమయంలో టెండర్లు
- ఇప్పటికే అకాల వర్షాలు.. మరి కొద్ది రోజుల్లో వర్షకాలం సీజన్
- కరీంనగర్ నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారుల తీరుపై విమర్శలు

కరీంనగర్ నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏటా ఎండకాలం ఆరంభంలో ప్రధాన మురుగుకాలువతోపాటు ఇతర కాలువల్లో చేపట్టాల్సిన సిల్ట్ తొలగింపు పనులను, ఇప్పుడు వానకాలం దగ్గరలో చేపడుతుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే అకాల వర్షాలు పడుతుండడం.. మరో పది, పదిహేను రోజుల్లో వానకాలం ప్రారంభమవుతున్న సమయంలో టెండర్లు నిర్వహిస్తుండడంపై అనేక సందేహాలు తెరపైకి వస్తున్నాయి. వర్షకాలం ముందు ఏదో హడావుడిగా పనులు చేసి.. అడ్డదారిలో బిల్లులు లేపేందుకే ఇలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే తమకు అనుకూలంగా పనులు చేపడుతూ ఇష్టారాజ్యంగా దండుకుంటున్నారనే ఫిర్యాదులు వస్తుండగా.. ఇప్పుడు వానకాలం దగ్గరలో టెండర్లు నిర్వహిస్తుండడంపై ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.


నగరంలోని ప్రధాన మురుగు కాలువ దుస్థితి

కార్పొరేషన్, మే 21: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని మురుగు కాల్వల్లో సిల్ట్ తొలగింపు కోసం తొమ్మిది పనులకు ₹50లక్షల వ్యయంతో ఇటీవల ఇంజినీరింగ్ యంత్రాంగం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆన్‌లైన్‌లో షెడ్యూల్ దాఖలు చేయడానికి సోమవారంతోనే గడువు(ఈ నెల 20) ముగిసింది. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు విస్తరించి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణశాఖ ప్రకటించింది. గతేడాది ఏప్రిల్‌లోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, మే నెలలో సిల్ట్ తొలగింపు పనులు చేపట్టగా.. ఈ ఏడాది మాత్రం ఇంజినీరింగ్ అధికారులు మే చివరి వారంలో టెండర్లు నిర్వహించడం విమర్శలకు తావిస్తున్నది. టెండర్లను ఇప్పుడు ప్రారంభిస్తే.. కాంట్రాక్టర్ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే అకాల వర్షాలు పడుతున్నాయి. వర్షాలు ఇంకా పడితే మురుగు కాల్వల్లో సిల్ట్ తీసే అవకాశాలు అంతంతే ఉంటాయి. వేసవిలో చేయాల్సిన పనులను ఇంజినీరింగ్ అధికారులు ఇప్పటి వరకు ఎందుకు పెండింగ్‌లో పెట్టారని పలువురు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. కేవలం వర్షాలకు ముందు హడావిడిగా పనులు చేసి, తప్పుడు లెక్కలతో బిల్లులు డ్రా చేసుకోవాలన్న ఆలోచనతోనే ఈ టెండర్లను ఆలస్యం చేశారని ఆరోపిస్తున్నారు. నగరంలో ఉన్న రెండు ప్రధాన మురుగు కాలువల్లో ఎక్కడో చోట సిల్ట్ నామమాత్రంగా తొలగించి దండుకోవచ్చనే లక్ష్యంతోనే ఇలా చేశారని విమర్శిస్తున్నారు. టెండర్ల విషయమై కార్పొరేషన్ ఎస్ఈ మహేందర్‌ను సంప్రదించగా.. ప్రతి సంవత్సరం మాదిరాగానే ఈ సారి కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎక్కడా ఆలస్యం జరగలేదని చెప్పారు.

## మూడేళ్లకే నూరేళ్లు

- తల్లితో కలిసి ఎల్లమ్మ పట్నాలకు వెళ్తొస్తుండగా బాలిక మృతి
- గుర్తు తెలియని వాహనం స్కూటీని ఢీకొని ప్రమాదం
- కుటుంబంలో విషాదం


విన్మయ (ఫైల్)

జగిత్యాల కలెక్టరేట్, మే 21: ఆ చిన్నారికి మూడేళ్లకే నూరేళ్లు నిండాయి. తల్లితో కలిసి సంతోషంగా ఎల్లమ్మ పట్నాలకు వెళ్తొస్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రాణాలు గాల్లో కలిశాయి. కండ్ల ముందే కూతుర్ని కోల్పోయిన ఆ తల్లి హృదయవిదారకంగా రోదించిన తీరు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. జగిత్యాల సీఐ వేణుగోపాల్ వివరాల ప్రకారం.. పెగడపల్లికి చెందిన నిమ్మని రాజు, శిరీష దంపతులకు ఐదేళ్ల కొడుకు, మూడేళ్ల కూతురు విన్మయ ఉన్నారు. రాజు ఇటీవలే ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. మంగళవారం జగిత్యాల పట్టణ పరిధిలోని లింగంపేటలో బంధువులు ఎల్లమ్మ పట్నాలు వేసుకుంటుండగా.. శిరీష తన కూతురు విన్మయతో కలిసి స్కూటీపై వెళ్లింది. సాయంత్రం దాకా సంతోషంగా అక్కడే గడిపి తిరిగి స్వగ్రామానికి పయనమైంది. లింగంపేట నుంచి బయల్దేరిన కొద్దిసేపటికే గుర్తుతెలియని వాహనం స్కూటీని ఢీకొట్టింది. దీంతో తల్లీ కూతుళ్లు కిందపడ్డారు. తల్లి స్వల్ప గాయాలతో బయటపడినా.. చిన్నారి తీవ్ర గాయాలతో మృత్యు ఒడికి చేరింది. చికిత్స కోసం జగిత్యాల జిల్లా ప్రధాన దవాఖానకు తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలోనే చనిపోయింది. దీంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొన్నది. కండ్ల ముందే బిడ్డ చనిపోవడంతో ఆ తల్లి గుండెలవిసేలా రోదిస్తున్నది. తల్లి శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## మళ్లీ భగ..భగ



అల్పపీడన ద్రోణితో వారం రోజులుగా చల్లబడ్డ వాతావరణం మళ్లీ వేడెక్కింది. మంగళవారం భానుడి భగభగలతో ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా ఆకస్మాత్తుగా ఎండతీవ్రత పెరిగింది. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరైంది. ప్రజలు మధ్యాహ్నం వేళ ఇండ్లకే పరిమితమయ్యారు. తప్పనిసరి పరిస్థితుల్లో గొడుగులు పట్టుకుని బయటకు వచ్చారు. – కరీంనగర్, ఫొటోగ్రాఫర్

# లక్ష్యసాధనకు కఠోరంగా శ్రమించాలి

- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి
- జిల్లా గ్రంథాలయంలో గ్రూప్-1 మాక్ టెస్ట్ పరిశీలన

కొత్తపల్లి, మే 21 : నిర్దేశించుకున్న లక్ష్య సాధనకు విద్యార్థులు కఠోరంగా శ్రమించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయాన్ని ఆమె స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారధి సొసైటీ ఆధ్వర్యంలో గ్రూప్-1 అభ్యర్థులకు ఏర్పాటు చేసిన మాక్ టెస్ట్‌ను పరిశీలించారు. ఎంత మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎన్ని టెస్టులు పెడుతున్నారు.. తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 270 మంది గ్రూప్-1మాక్ టెస్ట్ రాస్తున్నారని, ఐదు టెస్టులు ఏర్పాటు చేశామని అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి ప్రిపేర్ కావచ్చని తెలిపారు. జూన్ 9న జరుగనున్న గ్రూప్ -1 ప్రిలిమ్స్‌లో అభ్యర్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విజయం కోసం క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం గ్రంథాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వారధి సొసైటీ మెంబర్ సెక్రటరీ జీ ఆంజనేయులు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత, తదితరులు పాల్గొన్నారు.


మాక్ టెస్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి